తాండవనదికి రక్షణ గోడ నిర్మించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: తాండవనదికి పాయకరావుపేట ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని పిసిసి జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ వరదలు వచ్చినపుడల్లా తాండవనదిని ఆనుకొని ఉన్న కాలనీలతోపాటు, ముంపునకు గురయ్యే దళిత కాలనీల ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారని తెలిపారు. వరదలు నుండి శాశ్వత పరిష్కారంగా రక్షణగోడ నిర్మించాలన్నారు. కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాయకరావుపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అయితే పంచాయతీ అధికారులు మాత్రం పారిశుధ్య పనులు చేయడం లేదని జగతా శ్రీనివాస్ ఆరోపించారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన హోం మంత్రి వంగలపూడి

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేటలోని లోతట్టు ప్రాంతాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాండవ రిజర్వాయర్‌లో నీరు ఎక్కువగా చేరింది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేశారు. దీంతో తాండవ నదిని ఆనుకొని ఉన్న చాకలిపేట ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున అక్కడ మంత్రి అనిత పర్యటించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు అవసరమైన తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. తాండవ నదిలో నీరు ఎక్కువ చేరినప్పుడల్లా తామంతా భయం గుప్పెట్లో ఉండిపోతున్నామని ఆ ప్రాంతవాసులు మంత్రి అనిత దృష్టికి తీసుకొచ్చారు. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి అనిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాస రావు, యాళ్ల వరహాల బాబు, బోడపాటి శివదత్, చింతలపు ప్రదీప్, మల్లపురెడ్డి రమాకుమారి, పలువురు టిడిపి, జనసేన పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రక్షిత్ డ్రగ్స్, సాయినార్ పరిశ్రమలు విరాళం

విశాలాంధ్ర - పరవాడ: వరద బాధితుల సహాయ నిధికి రక్షిత్ డ్రగ్స్, సాయినార్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు రూ.10 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని రక్షిత్ డ్రగ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ రామేశ్వరరావు సోమవారం విపత్తు నివారణ సంస్థకు అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సీఎం చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌ల పిలుపు మేరకు సామాజిక బాధ్యతలో భాగంగా వరద బాధితుల సహాయ నిధికి ఆర్థిక సహాయం అందజేసినట్టు రామేశ్వరరావు పేర్కొన్నారు. విపత్తు నుండి విజయవాడ పరిసర ప్రాంతాలు త్వరగా కోలుకొని యధాస్థితికి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

దుక్క శృతిని అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలో రైవాడ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి దుక్క ఈశ్వరరావు కుమార్తె శృతి దేవరపల్లి హైస్కూల్లో చదువుతూ ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షల్లో 561 మార్కులు సాధించింది. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు యాదవ్ సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో అనకాపల్లి జిల్లా స్థాయిలో జరిగిన అభినందన సభలో అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దుక్క శృతికి అభినందనలు తెలిపారు. ఇంకా బాగా చదువుకొని జిల్లాకు మండలం సొంత గ్రామానికి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు చల్లా నానాజీ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పరిసర ప్రాంతాలలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలు, పంట పొలాలను స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్. ఎన్.ఎస్.రాజు సోమవారం పర్యటించారు. లక్ష్మీపురం చెరువును పరిశీలించారు. పట్టణ జనాభా ప్లాన్ ప్రకారం రోడ్లు, కాలువలు కట్టాలని సూచించారు. అనంతరం ద్వారకానగరంలో కాలువలు, డ్రైనేజీలు నిర్మించేందుకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.డి.ఓ శ్యాం సుందర్, కార్యనిర్వహణ అధికారి నారాయణరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు, వార్డు మెంబర్లు టి.శ్రీనివాస్, కందర్ప మాధురి శంకర్, ఎంపీటీసీ రామలక్ష్మి నాయుడు, బాలిబోయిన దేవుడు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, మొల్లు కృష్ణ, నులక దేవుడు, సికిలా చిన్న, మెండి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో చిక్కుకున్న మామిడిపాలెం గిరిజనులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం శంకరం పంచాయతీలో మామిడిపాలెం గ్రామం గిరిజనులు జలదిగ్బంధంలో చిక్కుకున్నారని ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి పేర్కొన్నారు. శంకరం, ఉరకగడ్డ రిజర్వాయర్‌లో నీరు ఎక్కువగా రావడంతో గిరిజనులు గెడ్డ దాటలేక రెండు రోజుల నుండి రాకపోకలు జరగలేదని మామిడిపాలెం గ్రామానికి రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆ గ్రామంతో పాటు తాటిపర్తి పంచాయతీలో ఆజయపురం, జాలం పల్లి పంచాయతీలో గొప్పూరు, సిరిపురం, ఆవురువాడ పంచాయతీలో కొండవీది పెద గొర్రెగెడ్డ, చిన గొర్రెగెడ్డ, చీడికాడ మండలంలో రెల్లలపాలెం, గోడుగుమామిడి, చెరుకుపల్లి, మల్లిపాడు, జాజులపాలెం, బందవీధి, కోత్తవీదీ గ్రామాలు కోనాం సంతకు మాడుగుల సంతకు వచ్చి సామాన్లు తీసుకు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో నానా ఇక్కట్లు పడుతున్నారన్నారు. తక్షణమే మామిడిపాలెం గిరిజన గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేసి రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. వీరివెంట ఉండూరు ఈశ్వరరావు, తార దేముడమ్మ, దారపర్తి బాలరాజు, సోమల నూకాలమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు ధైర్యం సీఎం చంద్రబాబు: హోంమంత్రి అనిత

విశాలాంధ్ర - నక్కపల్లి: తుఫాన్‌తో పెద్ద ఎత్తున నష్టపోయిన విజయవాడ ప్రాంతంలో ప్రజలకే కాకుండా రాష్ట్రం నుండే ప్రతి ఒక్కరికి మమ్మల్ని ఆదుకోవడానికి సకాలంలో స్పందించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నాడనే ధైర్యం విజయవాడ బాధితులను ఆదుకునే పరిస్థితిని బట్టి తెలుస్తుందని ఒక్క అక్కడే కాదు తమకు కూడా ఆయన ధైర్యం అని ఆ ధైర్యంతోనే ముందడుగులు వేసామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం తాండవ నదికి వస్తున్న వరద పరిస్థితులను పరిశీలించి నీటిని బయటకు వదిలే పరిస్థితిలో లోతట్టు ప్రాంతపు ప్రజలకు ఏ విధంగా ఆదుకోవాలి వారిని ఏ విధంగా రక్షించుకోవాలి అనేదానిపై నేరుగా ఆమె తాండవ నదిని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అధికారులతో వరద పరిస్థితిపై జరిగిన నష్టాన్ని భవిష్యత్తులో జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై క్షుణ్ణంగా సమీక్షించారు. గ్రామాల్లో వేగవంతంగా శానిటేషన్ పనులు పూర్తి చేయడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైరల్ జ్వరాలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు మంగళవారం ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం స్థానికులు విలేకరులతో మాట్లాడుతూ గత పదిరోజులుగా వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయని పరిస్థితులు చూస్తేనే చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సమర్థవంతంగా వరద బాధితులకు సహాయ సహకారాలు అందించే విషయంలో పది రోజులపాటు విజయవాడ కలెక్టరేట్లోనే ఉండి యంత్రాంగం అంతటిని అప్రమత్తం చేసి సేవలందించగలిగామని అటువంటి నాయకుడిని దేశంలో చూడలేమని ఆయనే మా ధైర్యం అని అన్నారు. ఇంతటి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్న వ్యక్తి చంద్రబాబు అని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకూడదని ఉద్దేశంతో రాత్రింబవళ్లు కష్టపడ్డారని ఆయన కష్టపడిన తీరుని చూసి నాయకుడు అంటే ఈయన అంటూ సంతోషం వ్యక్తం చేశారని అన్నారు. విజయవాడ వరద బాధితులకు సహాయం అందించే విషయంలో వీఆర్వో స్థాయి దగ్గర నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు స్వచ్ఛంద సంస్థలకు పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ బోట్లు విషయంలో కుట్ర కోణం ఉందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరుగుతుందని ఇప్పటికి ఇద్దరిని అరెస్ట్ చేసామన్నారు. చంద్రబాబుని అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి సంవత్సరం అయిందని అప్పట్లో జగన్మోహన్ రెడ్డి సంబరాలు చేసుకున్నారని ఈ విషయం గుర్తు చేసుకుంటేనే బాధగా ఉందని ఆనాడే ప్రజలు వైసీపీకి రోజులు అయిపోయాయని నిర్ణయించారని అటువంటి తీర్పు ఇచ్చారని అన్నారు. ఆమెతోపాటు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ దీపిక పాటిల్, ఆర్డీఓ జయరాం, డీపీఓ శిరీష రాణి, తహశీల్దార్ అంబేద్కర్, ఎండీఓ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఏవో దెందుకూరు సీతారామరాజు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్తు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, కురందాసు దాసు నూకరాజు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా యువ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, గుటూరు శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి చిట్టిబాబు, రమా కుమారి తదితరులు ఉన్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎంపీ సీఎం రమేష్ పర్యటన

విశాలాంధ్ర - కసింకోట: జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాలు ముంపునకు గురైన నేపథ్యంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ జిల్లాలో పలు ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ముందుగా శంఖవరం గ్రామం దగ్గరలో ఉన్న బొజ్జన్నకొండ పరిసర ప్రాంతాలలో నీట మునిగిన పంట పొలాలను, స్థానిక ఏలేరు కాలువను పరిశీలించి రైతాంగానికి ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైతే సొంత నిధులతో ఎక్స్కె యిటర్‌ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో రైతాంగాన్ని పట్టించుకోలేదని కాలువల పుడికతీతలు గురించి ఆలోచించలేదని గత ప్రభుత్వ విధానాలు మీద మండిపడ్డారు. అనంతరం యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్‌తో కలసి మునగపాక పరిసర ప్రాంతాలలో వడ్రపల్లి గ్రామ ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాల గురించి గ్రామస్థుల నుంచి వివరాలు అడిగి సేకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారీ వర్షం కురవడం వల్ల ఈ ప్రాంతమంతా అతలాకుతలమైందన్నారు. కొన్ని చోట్ల చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయని, రోడ్లు దెబ్బతిన్నాయని, విద్యుత్ అంతరాయం కలిగిందని, పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. అసాధారణ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని అధికార యంత్రాంగాన్ని వివరాలు తెలియజేయాలని ఆదేశం చినట్లు తెలిపారు. పర్యటనలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపూరెడ్డి పరమేశ్వరరావు, అధికారులు,స్థానిక ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికుల సమస్యలపై స్పందించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 9రోజు సోమవారం నల్ల బ్యాడ్జి ధరించి ఒంటి కాళ్ళతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్వైజర్లను (దళారీ) కాంట్రాక్టర్ల ద్వారా పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో వారు ఆటలాడుకుంటున్నారని లక్ష్మణ మండిపడ్డారు. గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా కలెక్టర్, అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ తరువాత నుండి విధుల బహిష్కరణ వంటి కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, చిన్న, రమణమ్మ, సత్యవతి, ఈశ్వరమ్మ, దేవుడమ్మ, రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయుసి ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 9వ రోజు నల్ల బ్యాడ్జి ధరించి ఒంటి కాళ్ళతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకులు ఎల్ వి రమణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్వైజర్లను (దళారీ) కాంట్రాక్టర్ల పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో వారు ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు. సంఘం నాయకులు పెదపూడి సత్యవతి మాట్లాడుతూ గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా కలెక్టర్,అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల కష్టార్జితం దాచుకున్న పిఎఫ్ డబ్బులు కూడా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ తరువాత నుండి విధులు బహిష్కరణ వంటి కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతి సోమేశ్వరరావు, లావణ్య, దుర్గా, రాము, సత్యవతి, వెంకట లక్ష్మి, సత్య దుర్గ, దుర్గా భవాని, లక్ష్మి, వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉప్పొంగిన వరహా నది

బలహీనంగా వరహానది గట్లు
యస్.రాయవరంలో వంతెనపై వరద నీరు

విశాలాంధ్ర - యస్.రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎగువ ప్రాంతాలైన నర్సీపట్నం ఏజెన్సీల నుండి భారీ వరద వస్తుండగా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో వరాహా నది ఉప్పొంగింది. ఎస్.రాయవరం మండలంలోని దార్లపూడి, సోముదేవుపల్లి, పెనుగొల్లు, ధర్మవరం, వమ్మవరం తదితర దిగువ ప్రాంతాల్లో వరాహా నది వరద ఉధృతంగా ప్రవహించింది. సోముదేవుపల్లి వద్ద గతంలో కోతకు గురైన గట్టు మరల కోతకు గురవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెనుగొల్లు గ్రోయిన్ వద్ద వరాహా నది రెండు భాగాలుగా విడి ఆ ప్రదేశంలో నీరు ప్రభావం తీవ్రంగా ఉంది. ఎస్.రాయవరం వద్ద వరాహా నది వంతెనపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతో అగ్రహారం, లింగ రాజుపాలెం, బసవపాడు, కర్రివాని పాలెం, పిట్లపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరు ఈ నది మీద వెళ్లకుండా రెవెన్యూ పోలీస్ అధికారులు రోడ్డుకు అడ్డుగా ఇరుపక్కల ట్రాక్టర్లను పెట్టడం జరిగింది. వమ్మవరం గ్రామ పంచాయతీ విశ్వనాధపురం గ్రామానికి వెళ్లే మార్గంలో వరహానది గట్టుకు దగ్గర్లో ప్రవహించడం వలన ఆ గ్రామస్తులు భయం గుప్పెట్లో ఉన్నారు. ఈ వరాహా నది వరదను కాలువల ద్వారా చెరువులకు విడుదల చేయడంతో పలు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటి మునిగాయి. బంగారమ్మ పాలెం గ్రామంలో ఆదివారం రాత్రి నుండి వర్షం నీరు గ్రామంలోని ఉండిపోవడంతో వెళ్లే మార్గం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సమస్యలను తెలుసుకున్న తహశీల్దార్ విజయకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లడం జరిగింది. వరద నేపథ్యంలో ఇరిగేషన్ ఏఈ భాను వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నత అధికారులకు తెలియజేస్తున్నారు. ఈ వర్షాలు ప్రభావంతో రెవెన్యూ, పంచాయతీరాజ్ పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం

విశాలాంధ్ర - కె.కోటపాడు: వర్షాలు తగ్గుముఖం పట్టినందున మేజర్ పంచాయతీ చౌడువాడలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎంపీడీవో ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో అధికారుల బృందం గ్రామాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు వెళ్లే మార్గాలను జెసిబి యంత్రాలతో తవ్విస్తున్నారు. మండలంలోని చిట్టి గెడ్డ, పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నాయని సమీప ప్రాంతాల ప్రజలు ఆ నీటిలో దిగరాదని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. గ్రామాల్లో దోమలు విజృంభించకుండా బ్లీచింగ్, ఫినాయిల్ జల్లాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, కార్యదర్శి రామానాయుడు తదితరులు ఉన్నారు.

పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని ఎన్జీ పాలెం, ఏనుగు తుని, తాళ్లపాలెం, రైతలపాలెం తదితర గ్రామాల్లో వర్షపు నీటి ముంపునకు గురైన వరి పంట పొలాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులతో కొణతాల మాట్లాడారు. రైతులు నష్టపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా కృషి చేస్తానని రైతులు ఎవరూ కూడా అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. మండలం మొత్తం ఇప్పటికే వ్యవసాయ అధికారులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్నారని తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ, కలిగట్ల సింహాద్రి, రైతులు ఉన్నారు.

ఉప్పొంగుతున్న వాగులు వద్ద పోలీసులు పహారా

విశాలాంధ్ర - గొలుగొండ: వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల వాసులకు ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా వాగుల వద్ద గొలుగొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగానే మండలంలో పాత మల్లంపేట వెళ్లే రహదారిలో ఉన్న వాగు వద్ద ప్రయాణికులు ఎవరు వాగులో దిగకుండా గొలుగొండ ఎస్సై పి రామారావు తమ సిబ్బందితో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు నేపథ్యంలో ఉప్పొంగి ప్రవహించే వాగుల్లో సాహసించి దిగడం చేయరాదని ఆయన అన్నారు. అదేవిధంగా వ్యవసాయ రైతులు కూడా తమ పంట పొలాలకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలో గల సీతయ్యపేట గ్రామంలో యువకులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితురాలు కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన నానిపల్లి దుర్గమ్మ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన పలువురు యువకులు కొంత నగదు చందాలు వేసుకుని బాధితురాలికి సహాయాన్ని అందజేయాలని నిర్ణయించుకున్నారు. మొత్తం 41900 నగదును సమాకూర్చారు. ఈ మొత్తం నగదును సోమవారం దుర్గమ్మ కుమారుడు నానికి నగదు అందజేశారు. ఈ నగదు ఆమెకు మెరుగైన వైద్యం కొరకు వాడుకోవాలని సీతయ్యపేట యూత్ సభ్యులు సూచించారు. ఈ యూత్ సభ్యులను గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా, శ్రీను, వజ్రపు బాబురావు, రాజుబాబు కరణం నాగేశ్వరరావు అభినందించారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

విశాలాంధ్ర - మునగపాక: గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా మునగపాక మండలంలో వాడ్రాపల్లి గ్రామం పొలాలన్నీ కూడా నీట మునిగాయి. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ సోమవారం వాడపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ రైతుల కష్టాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని దీనిపై సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా తీసుకోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమరశెట్టి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఆడారి మంజు, మల్ల వరహా నర్సింగరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టు: ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని ఖండివరం నుండి మాడుగులకు వచ్చే దారిలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మూసూరి వారి కల్లాల వద్ద మదుము కొట్టుకుపోవడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి అన్నారు. ఇటుగా నిత్యం మాడుగులకు వివిధ పనులపై ప్రజల అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. ఈ కల్వర్టు పడిపోవడంతో రైతులు తమ పొలాల్లోకి వెళ్లేందుకు అంతరాయం ఏర్పడిందన్నారు. అధికారులు నాయకులు స్పందించి ఈ మదుము నిర్మాణం చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని అయన కోరారు.

ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: భారీ వర్షాలు కారణంగా మండలంలో ముంపునకు గురైన ప్రాంతాలను రాష్ట్ర హోం మంత్రి అనిత సోమవారం పరిశీలించారు. భారీ వరద తాకిడికి ఇందేసమ్మ వాక వద్ద రోడ్డు కోతకు గురి కావడంతో ఆ ప్రాంతాన్ని, రామచంద్రపురం వద్ద ఆర్ అండ్ బి రోడ్డు బ్రిడ్జిని పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయకు ఆదేశించారు. మండలంలో వర్షాలు వల్ల జరిగిన నష్టాలను అంచనా వేసి నివేదికను అందించాలని తహశీల్దార్ జానకమ్మకు ఆదేశించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి ప్రాణ నష్టం లేకుండా వరద ముంపు నుండి కాపాడాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వరదల వల్ల ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమె వెంట జిల్లా ఎస్పీ దీపిక, నర్సీపట్నం ఆర్డీఓ జయరాం, ఎంపీడీవో కాశీ విశ్వనాధ రావు, తెదేపా నాయకులు జానకి శ్రీనివాసరావు, లాలం కాశి నాయుడు, ఎస్. రాయవరం మండల టిడిపి అధ్యక్షులు అబద్దం, సుంకర బాబ్జి, ఎలమంచిలి ప్రకాష్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన అయ్యన్న తనయుడు

విశాలాంధ్ర - గొలుగొండ: తుఫాను కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా పలు ప్రాంతాలు ముంపునకు గురి కావడంతో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ద్విచక్ర వాహనంపై పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గొలుగొండ మండలం కే.ఎల్లవరం గ్రామంలో సర్పంచ్ రాంబాబుతో కలిసి నీటి ఉధృతి కారణంగా ఇళ్లల్లోకి ప్రవేశించిన పరిస్థితిని పరిశీలించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పంట పొలాల వివరాలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. అలాగే ప్రజలు పడుతున్న ఇబ్బందులు గురించి వారికి అవసరమైన సహకారాలు గురించి ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు.

వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గొలుగొండ: తుఫాను కారణంగా గత రెండు రోజుల నుండి కురుస్తున్న అతి భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గల బొడ్డేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో సర్పంచ్ లోచల సుజాత, విలేజ్ రెవెన్యూ అధికారి సాంబమూర్తి, పంచాయతీ

కార్యదర్శి వై.శ్రీనివాసరావులు సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ వర్షాలు నేపథ్యంలో ప్రజలందరూ కూడా వాగులు వద్దకు వెళ్లకూడదని అన్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జన కార్యక్రమంలో ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకొని నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె సూచించారు. వినాయకుని నిమజ్జన సమయాల్లో వాగుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని అమె సందర్భంగా తెలియజేశారు.

పంట నష్టంపై అధికారుల అంచనా

విశాలాంధ్ర - కే.కోటపాడు: గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని 14 గ్రామాల్లో 205 ఎకరాల్లో వరి పంట నీటిముంపునకు గురైందని , నీరు పోయే మార్గాలను తక్షణమే ఏర్పాటు చేయాలని రైతులకు సూచించినట్లు అధికారుల బృందం తెలిపారు. సోమవారం మండల తహశీల్దార్ రమేష్ బాబు చెరుకు పరిశోధనా స్థానం సీనియర్ సైంటిస్టులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం ఏవో తులసి, స్థానిక వ్యవసాయాధికారి సోమశేఖర్ తదితరులు మేడిచర్ల, పైడింపేట, వారాడ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ముంపునకు గురైన వరి పంటకు తీసుకో వలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ

మండలంలో ఎక్కువగా ఎంటియు 1318 వరి రకాలు వేయడం వల్ల ముంపు తట్టుకునే శక్తి ఆ వరిపంటకు ఉంటుందన్నారు. పూర్తిగా నీరు తీసివేసి యూరియా పొటాష్ 20 కేజీలు చొప్పున జల్లుకోవాలన్నారు. పంటల్లో కుళ్ళు తెగులు కనిపిస్తే హెక్సాకొన జోల్ మందు వాడాలి అన్నారు. ఇకపై వర్షాలు ఆగినట్లయితే పంట నష్టం ఉండదు అన్నారు. గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారని, రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు అందిస్తారని అన్నారు. వీరి వెంట ఆయా గ్రామ సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

రచయిత కలవలపల్లి శ్రీనివాస్‌కి సన్మానం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: బిలాంకిజం అనే సరికొత్త తత్వశాస్త్రం, శాస్త్రీయ విజ్ఞానాన్ని వివరించిన పుస్తకమే సొసైటీ సైంటిస్ట్. బుచ్చయ్యపేట మండలం ఎల్ సింగవరం గ్రామానికి చెందిన కలవలపల్లి శ్రీనివాస్ చోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2023లో డిగ్రీ పూర్తి చేశారు. శ్రీనివాస్ చిన్ననాటి సమాజంలో జరిగిన వాస్తవ సంకటనాలని గ్రహించి పుట్టుక నుండి మరణం వరకు ఉన్న విషయాలపై శాస్త్రీయ దృక్పథంతో సొసైటీ సైంటిస్ట్ పుస్తకం

రచించారు. కలవలపల్లి శ్రీనివాసు, తనదైన ఆలోచనాత్మక వైఖరితో, తోటి యువకులకు భిన్నంగా జ్ఞానతృష్ణ కలిగిన విద్యార్థిగా "బిలాంకిజం" అనే పేరుతో ఈ పుస్తకములో పెట్టే ప్రయత్నం చేసాడు. వివిధ అంశాలపై విభిన్న దృక్పదంతో విశ్లేషించే ప్రయత్నం చేసే తీరు అభినందించదగినది. ఈ సందర్భంగా ఇటీవల శ్రీనివాస్‌ను డిగ్రీకళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, లైబ్రరీ అధ్యక్షులైన మల్యాద్రి, కళాశాలలో ఉపాధ్యాయులైన రాధా కృష్ణ, రామలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌లో నష్ట పోయిన అన్నదాతలకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం చుట్టుపక్కల గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వారిని ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ఏ.పి. రైతు సంఘం అనకాపల్లి

జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం, గాంధీగ్రామం, నర్సయ్యపేట, గౌరీపట్నం, అంకుపాలెం తదితర ప్రాంతాల్లో తుఫాన్ కి నష్టపోయిన పంట పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ.పి. రైతు సంఘం కార్యదర్శి రెడ్డిపల్లి మాట్లాడుతూ తుఫాను భారిన పడిన నష్టపోయిన రైతులను అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు గానీ పట్టించుకొనే పరిస్థితి నేటి వరకు లేదన్నారు. వ్యవసాయదారులు ఆరుగాలం కష్టపడి పెట్టిబడులు పెట్టి, ఆశగా ఎదురుచూసే అన్నదాతపై ప్రకృతి కన్నెర్ర చేసిందని, చేతికి అంది వచ్చే పంటలు వరద నీటి పాలై రైతాంగం కన్నీరు మున్నీరు అవుతున్నారని అన్నారు. తుపాన్‌లో నష్టపోయిన వ్యవసాయదారులకు ఎకరాకి రూ.30,000/- ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ధా అమర్నాథ్, సదరం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వినాయక చతుర్థి వేడుకలు

విశాలాంధ్ర - మాకవరపాలెం :వినాయక చవితి సందర్భంగా మాకవరపాలెం రామాలయం వద్ద మాజీ జడ్పీటీసీ రుత్తల శేషుకుమార్, ఉపసర్పంచ్ లాలం రాము, బోలెం సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు జరిగాయి. మాకవరపాలెంలో అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం వినాయకుని పుట్టినిల్లు గా భావించి భీమన్న తాత కుమారుడు నాగేశ్వరావు ఇంటి వద్ద నుండి బ్యాండ్ మేళం తో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా రామాలయం వద్దకు తీసుకు వచ్చి దుర్గా సురేష్, లక్ష్మిలు విగ్రహ ప్రతిష్ట చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమ్మెలోకి కాంట్రాక్ట్ నర్సులు

విశాలాంధ్ర - చోడవరం: ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సులు మూకుమ్మడిగా సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఏ.ఎన్.ఎం.లను స్టాఫ్ నర్సులుగా రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు పట్ల కాంట్రాక్టు నర్సులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ళ తరబడి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలనుంచి బోధన ఆసుపత్రుల వరకు పనిచేస్తున్న నర్సులకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ ఆందోళన తెలిపారు. ఇప్పటికే అన్ని బోధన ఆసుపత్రుల అధికారులకు సమ్మె నోటీసులు అందజేసామని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ నర్సుల సంఘం నేతలు మీడియాకు తెలియజేసారు.

తాండవనదిలో చేరిన వరద నీరు

విశాలాంధ్ర - పాయకరావుపేట: వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా తాండవ రిజర్వాయర్‌లో ఎగువ ప్రాంతాల నుండి నీరు ఎక్కువగా చేరింది. దీంతో అధికారులు తాండవ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని తాండవనదిలో వరద నీరు ఎక్కువగా చేరింది.

తాండవనదిని ఆనుకొని ఉన్న పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో, కాలనీల్లో అధికారులు అప్రమత్తమై పర్యటించారు. తాండవనదిలో వరద నీరు ఎక్కువగా చేరి ఇళ్లు ముంపునకు గురైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ముంపునకు గురయ్యే చాకలి పేటలో టిడిపి మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, సీఐ జీఎన్ అప్పన్న తదితరులు పర్యటించి అక్కడ నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాఠశాల భవనంలోకి గురుకుల విద్యార్థులు తరలింపు

విశాలాంధ్ర - గొలుగొండ: మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఉండే డార్మెటరీ భవనం అసౌకర్యంగా ఉండడంతో విద్యార్థుల సౌకర్యార్థం అందరినీ పాఠశాల భవనానికి తరలించడం జరిగిందని ప్రిన్సిపాల్ ఎం.కోటేశ్వరరావు సోమవారం

ప్రకటనలో తెలిపారు. తుఫాను కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో గురుకుల పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఈ విధంగా పాఠశాల భవనం లోకి తరలించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రతి 30 నిమిషాలకు వాతావరణాన్ని వర్షం తీవ్రతను అంచనా వేసుకుంటూ విద్యార్థులకు తోడుగా రాత్రంతా వారి వద్ద పహార కాయడం జరిగిందని ప్రిన్సిపల్ కోటేశ్వరరావు ఈ సందర్భంగా తెలియజేశారు.

సత్యవరం వంతెనపై రాకపోకలు నిలుపుదల

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామం వద్ద తాండవ నదిపై నిర్మించిన వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. కురుస్తున్న వర్షాలకు తాండవ రిజర్వాయర్ లో వరద నీరు ఎక్కువగా చేరడంతో గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో తాండవ

నదిలో వరద నీటి ప్రవాహం ఉధృతంగా పెరిగి తాండవనదిలో నీరు ఎక్కువగా చేరింది. దీంతో సత్యవరం గ్రామం వద్ద నిర్మించిన వంతెన పైభాగం నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తమై వంతెన మీద నుంచి రాకపోకలు నిలిపి వేశారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన సాయి కృష్ణ

విశాలాంధ్ర - మునగపాక: అనకాపల్లి జిల్లాలో గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా వందల ఎకరాల పంట నీట మునిగి రైతుకు కన్నీరు మిగిల్చిన దృష్ట్యా జిల్లా లో యలమంచిలి నియోజకవర్గం మునగపాక లో నీటమునిగిన పంటను పరిశీలించి నష్టపోయిన రైతులను పరామర్శించి సదరు రైతులకు భరోసా ఇచ్చిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ. అలాగే నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుండి పరిహారం వచ్చేలా కృషి చేస్తానని సాయికృష్ణ తెలిపారు.లి గ్రామ శాఖ అధ్యక్షుడు దాడి శివ, ఆడారి గోవింద్, శరగడం జగన్, పీలా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికుల సమస్యలపై కలెక్టర్, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించాలి

విశాలాంధ్ర - చోడవరం: సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏ.పి. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో కార్మికులు ఒంటికాలిపై సోమవారం వినూత్న నిరసనలు తెలిపారు. ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 9వ రోజు తమ కోర్కెలు సాధనకు శాంతియుతంగా నల్ల బ్యాడ్జి ధరించి నిరసనలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ఏ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి లో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్వైజర్లను (దళారీ) కాంట్రాక్టర్లు పెట్టడం వలన ప్రతి నెలా వారికి జీతాలు సక్రమంగా ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు. సంఘం నాయకులు ముత్యాల కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ, దీనిపై సంబంధిత జిల్లా కలెక్టర్, అధికారులు ప్రజా ప్రతినిధులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల కష్టార్జితం దాచుకున్న పి.ఎఫ్ డబ్బులు కూడా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు అందరికీ ఈ నెల 15వ తేదీలోగా బకాయిపడ్డ జీతాలు చెల్లించాలని, జీ.ఓల ప్రకారం జీతాలు పెంచాలని, 2021 జూన్ నెల నుండి రావాల్సిన వేతనానికి తగిన పిఎఫ్ డబ్బులు మొత్తం లెక్కలు చెప్తూ జమ చేయాలని, ఇ.ఎస్.ఐ కార్డులు ఇవ్వకుండా ప్రతి నెల ఇఎస్ఐ పేరుతో వేతనంలో కట్ చేసుకున్న డబ్బులు మొత్తం తిరిగి జీతాల్లో చెల్లించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ తరువాత నుండి విధులు భవిష్కరణ వంటి కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కణితి కుమారి, సింగంపల్లి మంగ, కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వి.మాడుగుల: మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు 9వ రోజు నల్ల బ్యాడ్జి ధరించి ఒంటి కాళ్ళతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ సూపర్‌వైజర్లను (దళారీ) కాంట్రాక్టర్ల పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఇవ్వకుండా వర్కర్ల జీవితాలతో వారు ఆటలాడుకుంటున్నారని లక్ష్మణ మండిపడ్డారు. సంఘం నాయకులు రాజ్య లక్ష్మి మాట్లాడుతూ గత మూడు నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు, శాంతియుత పద్ధతిలో నిరసన ధర్నాలు చేస్తున్నప్పటికీ దీనిపై సంబంధిత జిల్లా కలెక్టర్, అధికారులు ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కార్మికుల కష్టార్జితం దాచుకున్న పిఎఫ్ డబ్బులు కూడా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు అందరికీ ఈ నెల 15వ తేదీలోగా బకాయి ఉన్న అన్ని నెలల జీతాలు చెల్లించాలని, జీఓల ప్రకారం జీతాలు పెంచాలని, 2021 జూన్ నెల నుండి రావాల్సిన వేతనానికి తగిన పిఎఫ్ డబ్బులు మొత్తం లెక్కలు చెప్తూ జమ చేయాలని, ఇఎస్ఐ కార్డులు ఇవ్వకుండా ప్రతి నెల ఇఎస్ఐ పేరుతో వేతనంలో కట్ చేసుకున్న డబ్బులు మొత్తం తిరిగి శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులకు, సూపర్వైజర్లకు అందరికీ చెల్లించాలని ఈ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా 15వ తేదీ తరువాత నుండి విధులు భవిష్కరణ వంటి కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాతబాబు, ప్రసాద్, అసరయ్య, ఎల్లమ్మ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానంలో సామూహిక మహా లింగార్చన

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని పి.ఎస్.పేట బ్రాహ్మణ వీధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానంలో నిర్వహించెడి 133వ గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు అయిన సోమవారం విభూది అలంకారంలో స్వామి దర్శనమిచ్చారు. నవరాత్రులు సందర్భంగా మూడవ రోజు భక్తులచే సామూహికంగా మహాన్యాస పూర్వక ఏకవార లింగార్చన ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రులు సందర్భంగా ప్రతీ రోజూ వేకువ జామునే లక్ష్మీ గణపతి హెూమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్, శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పుత్రేవు శ్యామ్ ప్రసాద్ తెలియజేసారు. ఎస్.ఎల్.జి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవరాత్రుల్లో ప్రతీ రోజూ భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శాశ్వత అన్నదానము పథకం కు, ఆలయ అభివృద్ధికి ఒక లక్ష రూపాయలు భక్తులు, దాతలు విరాళాలు అందజేసి సహకరించ వలసిందిగా కోరారు. చోడవరం స్వయం భూ విఘ్నేశ్వర ఆలయంలో స్వామి విభూది అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునే మహా గణపతికి పురుష సూక్త విధానంలో ప్రత్యేక పంచామృత అభిషేకములు చేసి, లక్ష్మీ గణపతి హెూమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతి తెలియజేసారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పరవాడ: అధిక వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అధికారులను ఆదేశించారు. పరవాడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరినీ అప్రమత్తం చేసి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని పారిశుధ్య లోపాలపై దృష్టి సారించాలని, క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పనుల అంచనా ప్రతిపాదనలు తయారుచేసి వెంటనే ప్రారంభించే విధంగా కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోని ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో 108 వాహనం అందుబాటులో లేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో అంబులెన్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, ఎంపీడీవో హేమ సుందరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పలువురు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాలను తహశీల్దార్ పరిశీలన

విశాలాంధ్ర - నక్కపల్లి: పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలం లోని గొడిచెర్ల, ఉద్దండపురం, గునుపూడి రెవెన్యూ పరిధిలో ఉన్న నీటితో నిండిన వరి పొలాలను తహశీల్దార్ అంబేద్కర్ సోమవారం పరిశీలించారు. ఆయనతో పాటు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్‌తో కలిసి నీటితో ఉన్న వరి పొలాలను పరిశీలించి వ్యవసాయ అధికారులను పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పొడగట్ల పాపారావు, సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావుతో కలిసి వరి పొలాలను చూసి రైతులకు నష్టం జరగకుండా వారికి సహకారం అందించాలని రామకృష్ణ కోరారు. నిండిన పొలాల పరిస్థితులను మాజీ సర్పంచ్ పొడగట్ల వెంకటరమణ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వెంకటరమణ, జనసేన పార్టీ నాయకులు నల్లల రత్నాజీ లు కలసి నీటితో నిండిన పొలాలు పైనుంచి వస్తున్న నీటి ఉధృత ఇదే కొనసాగితే రైతులు నష్టపోతారని తాసిల్దార్ అంబేద్కర్ కు వివరించారు.

పరిస్థితులను వ్యవసాయ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు.

51

పెద్దేరు రిజర్వాయర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలో జాలంపల్లి పంచాయతీ లో ఉన్న పెద్దేరు రిజర్వాయర్‌ను సోమవారం ఉదయం అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ పరిశీలించారు. తహశీల్దార్ పీవీ.రత్నం, ఇరిగేషన్ ఈఈ త్రినాథ్ డిఈ చిన్నంనాయుడు, ఎఈ సుధాకర్ రెడ్డి, ఏఈ భార్గవ్ కుమార్, జి.పైడితల్లి బాబు రిర్వాయర్ ఇన్ ఫ్లో అవుట్ ఫ్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దేరు రిజర్వాయర్ లో నీరు పెరిగే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను

ఆదేశించారు. జాలంపల్లి పంచాయతీకి సంబంధించి 14 గిరిజన గ్రామాలు ఉన్నాయని ఆ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీవీఎస్. గోపాలరావు, ఈఓపిఆర్డి మీనా కుమారి, ఎంపీపీ రాజారామ్, జడ్పిటిసి కిముదు రమణమ్మ, జాలంపల్లి సర్పంచ్ చిన్ని, మాజీ సర్పంచ్ పల్లా శ్రీనివాసరావు, కోన చంటి, కిలిమి గోపాల్, చింతామూర్తి ఖాతా వెంకటరమణ, ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వి.రమేష్, ఏఓ వాసుదేవరావు, ఆర్అండ్‌బి జెఈ శ్రీనివాస్, పిఎల్.సతీష్ కుమార్, కె.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.